



మానుకోట కొత్త బజారు పిన్‌కోడ్ మార్పు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని కొత్త బజారుకు సంబంధించి ఇప్పటి వరకు వినియోగిస్తున్న 506101 పిన్‌కోడ్‌కు బదులుగా.. 506102ను ఉపయోగించాలని మహబూబాబాద్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎమ్డీ నయీముద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వచ్చిన సాంకేతిక మార్పుల వల్ల ఉత్తరాల డెలివరీ జాప్యాన్ని తగ్గించేందుకు పిన్‌కోడ్ మార్పు అవసరముందని చెప్పారు. ముఖ్యంగా మహబూబాబాద్ కొత్తబజారు ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులు గమనించి ఇక నుంచి 506102 పిన్‌కోడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొత్త ఆవిష్కరణలకు ఇన్‌స్పైర్

- బాలలను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ యత్నం
- 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు అవకాశం
- దేశవ్యాప్తంగా లక్ష అవార్డులు
- 'మానక్' నామినేషన్ల సమర్పణకు సెప్టెంబరు తుది గడువు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిస్తూ, ప్రయోగాల వైపు మళ్లించి నేటి బాలమేధావులే..రేపటి భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మానక్ పోటీలు నిర్వహిస్తుంది. కేంద్రమానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల్నీ అందజేస్తుంది. ప్రతిభ చూపిన విద్యార్థికి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అభినందనలు, ఆతిథ్యంతో పాటు దేశంలో పేరుపొందిన శాస్త్రవేత్తలతో సమాలోచనలు పంచుకునే అవకాశం కల్పిస్తారు. వినూత్న ఆలోచనలతో దరఖాస్తు చేసుకొని జిల్లా, రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై తరువాత జాతీయస్థాయి ప్రదర్శనలో పాల్గొనాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జపాన్‌కు వెళ్లి సకుర సైన్స్ కార్యక్రమంలో పాల్గొని నోబెల్ శాస్త్రవేత్తలను కలిసే అవకాశం ఉంది.



సైన్స్ విద్యార్థి ఆలోచనతో..

అడవి జంతువుల బారీ నుంచి వ్యవసాయ పంటలను కాపాడుకోవడానికి క్షేత్రం చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి రిమోట్‌తో ఆపరేట్ చేస్తే ఫలితం ఉంటుందని సైన్స్‌క్లాస్‌లో ఒక విద్యార్థి సూచించాడు. అతనిలో బాల మేధావి పురుడు పోసుకుంటున్నాడని గుర్తించిన ఉపాధ్యాయులు ఈ ఆలోచన ఇన్‌స్పైర్ ప్రోగ్రాంకు పంపించారు. ప్రభుత్వం సదరు ప్రతిపాదనను ఎంపిక చేసి రూ.10 వేలు నగదు అవార్డును అందించింది. దీంతో ఆ విద్యార్థి భావి శాస్త్రవేత్త తరహాలో జాతీయ స్థాయి పోటీలకు వెళ్లగలిగాడు. ఇలాంటి చిన్నారుల చురుకైన మెదళ్లలో మెదిలే ఆలోచనలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడమే ఇన్‌స్పైర్ కార్యక్రమ లక్ష్యం. సమాజాభివృద్ధికి భావితరాలకు ఉపయోగపడే ఆలోచనలను చిన్నారుల చురుకైన మెదళ్లలో ప్రేరేపించడం, సైన్స్ అధ్యయనం పట్ల ఆసక్తిని పెంపొందించడం ఇన్‌స్పైర్ ప్రధాన లక్ష్యాలు కేంద్ర ప్రభుత్వం 2008లో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆరో తరగతి నుంచి పోస్ట్ డాక్టోరల్ డిగ్రీ వరకు విద్యార్థుల కోసం మూడు పథకాల ద్వారా ఐదు రకాల ప్రోగ్రాంలను అమలు చేస్తోంది.

'మనక్' ఎవరి కోసం..

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం ఇన్‌స్పైర్-మనక్ (మిలియన్ మైండ్స్ ఆగ్‌మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) ప్రోగాం రూపొందించారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ కార్యక్రమంలో నామినేషన్లు సమర్పించడానికి సెప్టెంబరు చివరి వరకు తుది గడువు ఉంది. అంటే.. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 10 నుంచి 17 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా లక్ష మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. తమ చుట్టు పక్కల పరిస్థితులు వాతావరణంలో ఎదురయ్యే రకరకాల సామాజిక సమస్యలకు విద్యార్థుల చురుకైన మెదళ్లలో మెదిలే పరిష్కారాలను వెలికితీయడమే మనక్ లక్ష్యం. దీనికోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తాము గుర్తించిన సమస్యలకు తోచిన స్వంత పరిష్కారాలను తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి.

ఎలా చేయాలి అంటే..

ప్రతీ స్కూల్ కోడ్ నుంచి గరిష్టంగా ఐదు ప్రతిపాదనలను అప్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. ఒక విద్యార్థి పంపిన ప్రతిపాదన జాతీయస్థాయి వరకు వెళ్తే తర్వాతి సంవత్సరాల్లో మళ్లీ పంపడానికి ఆస్కారం లేదు. ఆ ప్రతిపాదన ఏదైన కారణాలతో ఎంపిక కాకుంట పోతే మరో ఆలోచనతో అదే విద్యార్థి మళ్లీ ప్రయత్నించవచ్చు. తుది ప్రతిపాదనలను డీఎస్టీ పోర్టల్ (www.inspireawardsdst.gov.in.)లో అప్‌లోడ్ చేయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను

(మిగతా 8వ పేజీలో...)

ఇన్‌స్పైర్ అంటే ఏమిటి...

ఇన్‌స్పైర్ అంటే 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రిసెర్చ్'.. ఇది బేసిక్ నేచురల్ సైన్స్‌లకు సంబంధించి విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందింపచేయడానికి సామర్థ్యాలను వృద్ధి చేయించడానికి డీఎస్టీ ప్రారంభించిన కార్యక్రమమే ఇన్‌స్పైర్. ఇది అమలు చేసే మూడు పథకాల్లో మొదటి స్కీం ఫర్ ఎర్లీ అట్రాక్షన్ ఆఫ్ టాలెంట్ ఫర్ సైన్స్ (ఎస్ఈఏఈటీఎస్) ఇందులో రెండు ఉప కార్యక్రమాలు ఉన్నాయి. అవి ఇన్‌స్పైర్ అవార్డు-మనక్, ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్, రెండోది స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎస్‌హెచ్ఈ). మూడోది అస్యూర్డ్ ఆపర్చునిటీ ఫర్ రిసెర్చ్ కెరియర్ (ఏఓఆర్‌సీ). ప్రస్తుతం పాఠశాలస్థాయి విద్యార్థుల కోసం మనక్ ప్రోగ్రాంకి ప్రకటన విడుదలైంది.



సృజనాత్మకతను వెలికితీసేందుకు...

బి.అప్పారావు,
జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ కార్యక్రమాలు దోహదపడుతాయి. నాణ్యమైన, వినూత్నమైన ప్రదర్శనలు, ప్రాజెక్టులను రూపొందించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆలోచనలకు మరింత మెరుగులు దిద్ది నాణ్యమైన సైన్స్ ప్రాజెక్టుల తయారీకి ప్రోత్సాహం అందించాలి.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సూచించారు. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడుతాయని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి గ్రంథాలయ పన్నుపై ఆధారపడి ఉందని, అందుకోసం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు వసూలు చేసిన గ్రంథాలయ పన్ను ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించి అభివృద్ధికి దోహద పడాలని సూచించారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం అధికారుల సహకారం, ప్రజల భాగస్వామ్యం, దాతల ఔదార్యాం ఎంతైనా అవసరముందని చెప్పారు. ప్రతీ ఒక్కరు గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామలు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, మునిసిపల్ కమిషనర్లు టి.రాజేశ్వర్, విజయ్‌ఆనంద్, నిరంజన్, వి.శ్యాంసుందర్, జిల్లా ఆడిట్ అధికారి మాన్విజగన్, లావణ్య, సంపత్, కె.దేవేందర్, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.

ఉద్యమాల యోధుడు ప్రభంజన్ కన్నుమూత



- ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలోకి...
- బీసీ కులాల హక్కుల కోసం నిరంతర పోరాటం
- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- తెలంగాణ వర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్‌గా కొంతకాలం విధులు
- స్వస్థలం పాలకుర్తి మండలం గూడూరు గ్రామం
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత

7

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- మాజీ ఎంపీ మాలోతు కవిత



సమావేశంలో మాట్లాడుతున్న మాలోతు కవిత

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. గూడూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు చేస్తున్న పాపాలు.. ప్రజలు శాపంగా మారాయని విమర్శించారు. దశాబ్దలా కాంగ్రెస్ పాలనతో వ్యవసాయరంగం వెన్నువిరిగిందని ఆరోపించారు. వ్యవసాయం దండుగా కాదు.. పండగ అని చాటిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధును రాజకీయం చేసి

(మిగతా 8లో...)

రైతులకు నైపుణ్యా శిక్షణ ఇవ్వాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శాస్త్రవేత్తలను కోరారు. మహబూబాబాద్‌మండలం మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ పరిశోధన స్థానాలను ఆయన బుధవారం సందర్శించారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన అనంతరం వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా పరిశోధనలు ఉండాలని శాస్త్రవేత్తలకు సూచించారు. సరైన సమయంలో రైతులకు వ్యవసాయంలో ఎరువులు, పురుగుల మందుల వాడకం, విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయశాఖతో అనుసంధానమై రైతులతో మమేకమై కొత్త వంగడాలను, సాంకేతిక విధానాలను తీసుకువచ్చి రైతులకు లాభసాటిగా ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేపట్టాలని, రైతులకు అందుబాటులో సామాజిక మాధ్యమాలైన వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వ్యవసాయంలో మెలకులు, సాంకేతిక విధానాలను అందించాలన్నారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ పరిశోధన స్థానంలో ఉన్న సమస్యలను యూనివర్సిటీ అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, మరిన్ని నిధులు వచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరతానని చెప్పారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, జేవీఆర్ ఉద్యాన అధిపతి కత్తుల నాగరాజు, డాక్టర్ అశ్విని, సుహాసిని, ప్రశాంత్, మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, ఆవుల వెంకన్న, తప్పెట్ల వెంకన్న, ఎడ్ల వేణు, తేళ్ల శ్రీను, జేరిపోతుల వెంకన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కర్పూరపు గోపి, మహబూబ్‌పాషా, అంబాల శివ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీని శాస్త్రవేత్తలు సత్కరించారు.



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

జిల్లా అదనపు కలెక్టర్‌గా అనిల్‌కుమార్

మహబూబాబాద్ టౌన్, జూలై16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా అనిల్‌కుమార్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన కె.వీరబ్రహ్మాచారి పదవి వీరమణ చేశారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న అనిల్‌కుమార్‌ను మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో..

ఏసీబీ అధికారుల సోదాలు

- రికార్డుల పరిశీలన, కొన్ని సరుకుల శాంపిల్స్ స్వీకరణ

6



ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు

శతాబ్దిన్నర కిందటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వైఎస్ హయాంలో ప్రతిపాదనలకు నోచుకున్న ఈ ప్రాజెక్టు... 17 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం కోసం రిజర్వాయర్ కడతామంటున్న కేంద్రానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడం, ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశాన్ని పరిశీలించాలని కోరడంతో ఇది తెరపైకి వచ్చింది. బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి ఈ మేరకు ప్రతిపాదించింది. అయితే.. ఇచ్చంపల్లి ప్రాజెక్టు వల్ల కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందని తెలుస్తోంది. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

- ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

మళ్లీ 'ఇచ్చంపల్లి'...

తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం

- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ
- బనకచర్ల ప్రాజెక్టు వివాదం నేపథ్యంలో సర్కారు చర్యలు
- మేడిగడ్డ బ్యారేజీ ఉనికి ప్రశ్నార్థకమే..?
- 159 ఏళ్ల క్రితం నిజాం కాలంలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు పునాది

7



ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో ఫ్రెంచ్ అధికారులు నిర్మించిన తాత్కాలిక రోడ్డు

షార్ట్‌సర్క్యూట్‌తో రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



షెడ్డులో చెలరేగుతున్న మంటలు

గోవిందరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలోని శ్రీవాసమాంబ రైస్‌మిల్లులో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. రైస్‌మిల్లు యజమాని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 11గంటల సమయంలో మిల్లు ముందుభాగంలో ఉన్న షెడ్డులో 100గన్నీ బ్యాగులను భద్రపరిచామని అన్నారు. ఆప్రాంతానికి కోతులమూక పెద్ద సంఖ్యలో చేరుకుని కరెంటు వైర్లను ఊపడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి షెడ్డు పూర్తిగా దగ్ధమైందని అన్నారు. కిటికీ మీదుగా మిల్లు లోపలికి మంటలు వ్యాపిస్తుండగా చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో స్పందించిన పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్‌లు ఫైరింజన్‌ను తెప్పించి మంటలు ఆర్పించారని, ఈఘటనలో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు.

మానుకోటలో మతిస్థిమితంలేని వ్యక్తి వీరంగం

● ఇద్దరిపై దాడి.. కారు అద్దాలు ధ్వంసం



జానీని తాళ్లతో కట్టేసి జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్వాడీ బజారులో బుధవారం వీరంగం సృష్టించాడు. పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగలగొట్టడంతో పాటు కత్తెరతో ఇద్దరు బాటసారులపై దాడికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మరిపెడ మండలం బురాన్‌పురం గ్రామానికి చెందిన ఎస్‌కే జానీ అనారోగ్యంతో ఈ నెల 14న జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. బుధవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లి మార్వాడీ బజారులో అరవింద్ హాస్పటల్ ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేశాడు. అటువైపుగా వెళ్తున్న బాటసారులు ఇద్దరిపై కత్తెరతో దాడి చేసి, గాయపరుస్తున్న క్రమంలో స్థానికులు జానీని కాళ్లు, చేతులు కట్టి బంధించి టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివ సిబ్బందితో ఘటనా స్థలంకు చేరుకొని జానీని ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

చిట్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆస్పత్రిలో అవసరమైన వైద్యులను నియమించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో 18 మంది వైద్యులకు గాను 6గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మండలంలో పాటు చుట్టుపక్కల నాలుగు మండలాలకు చెందిన పేద ప్రజలు వందల సంఖ్యలో చిట్యాల ఆస్పత్రికి వస్తారన్నారు. కొన్నేళ్లుగా గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు, డెంటిస్టు వైద్యులు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని కోరారు.

ఎండాకాలాన్ని తలపిస్తున్న వానాకాలం

● పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరి బిక్కిరి
● వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు, ప్రజలు



మహబూబాబాద్ శివారు పత్తిపాక రోడ్డులో మిట్ట మధ్యాహ్నం వేళలో నిర్మానుష్యంగా కన్పిస్తున్న రోడ్డు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎండాకాలం తలపిస్తోంది. జోరుగా వర్షాలు కురిసే జూలై మాసంలో వేసవి ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. జూన్ మాసంలో రోహిణి కార్తె పూర్తయి మృగ శిర కార్తె ప్రవేశంతోనే వర్షాలు ఆరంభమై వ్యవసాయ పనులు షురూ అవుతాయి. ఈ సంవత్సరం ముందస్తుగా నైరుతి రుతుపవనాలు వచ్చి వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పినప్పటికి నేటికి వర్షాలు జాడ లేకుండా పోయాయి. జూన్ మాసంలో అడపతడప జల్లులు కురవడంతో రైతన్నలు పునాస పంటలు వేశారు. అక్కడక్కడ రైతులు ముందస్తుగా పత్తి విత్తనాలు కూడ నాటారు. వరి నార్లు కూడ పోసుకుని సిద్దంగా ఉన్నారు. వర్షాలు వస్తే పొలాల్లో నాట్లు వేసేందుకు అన్నదాతలు సిద్దమవుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బావుల్లో నీరు అంతగా లేక పోవడంతో పత్తి చేనులు ఎండి పోతాయమోనన్న ఆందోళనతో ఎప్పుడు వర్షం వస్తుందా అని ఆకాశం వైపు ఎదుర చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వరుణ దేవుడు కరుణించి వర్షం కురిపించాలని పూజలు చేస్తున్నారు.

జూలై సగం దాటిన పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ....

వర్షాకాలం ఆరంభమై నెల దాటిన.. జూలై మాసం సగం పూర్తయిన వర్షాలు పడక పోగా రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఎండ కాలాన్ని తలపిస్తోంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్క పోతతో జనం అల్లాడి పోతున్నారు. ఇంకా ఎండకాలం తరహాలోనే ఇళ్లలో ఏసీలు, కూలర్లు నడుస్తునే ఉన్నాయి. ఉపశమనం కోసం జ్యూస్ షాపులు, కొబ్బరి బొండాల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఎండలు విపరీతంగా ఉండడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈనెల 13న అత్యధికంగా 36.3 డిగ్రీలు, అత్యల్పంగా 24.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. 14న అత్యధికంగా 37.3, అత్యల్పంగా 25.1, 15న అత్యధికంగా 37.8, అత్యల్పంగా 24.7 డిగ్రీలు, తాజాగా 16న అత్యధికంగా 37.5, అత్యల్పంగా 25.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు ముందుకు రావాలని, ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు ఆయిల్‌పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకమని, వ్యవసాయ, ఉద్యానశాఖలు సంయుక్త కృషితో ఈఏడాది సాగు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వారీగా సాగు లక్ష్యాలను నిర్దేశించి పూర్తి చేయాలని ఆదేశించారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్ర స్థాయిలో సంబంధితశాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలన్నారు.

ఆయిల్‌పామ్ పంట సాగుద్వారా అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియజేయాలన్నారు. జిల్లాలో మండలాలవారీగా ఏఈవో క్లస్టర్‌వారీగా ఐదెకరాలకు పైబడి రైతుల వివరాలు, బోరు సౌకర్యం కలిగిన రైతులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఆయిల్‌పామ్ పంట సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 5వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని, నిర్దేశించిన టార్గెట్లను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మరిపెడ విశ్రాంతి భవన్‌లో అధికారులతో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు మరిపెడలోని జూనియర్ సివిల్ కోర్టుకు స్థానిక అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. డిప్యూటీ స్పీకర్ వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దవంగర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు బుధవారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ దొంగరి కళమ్మ, డ్రైవర్ దొంగరి సతీష్, నాలి యాకన్న, అంగోతు చందులాల్, ట్రాక్టర్ ఓనర్ అంగోతు అంబా, మాలోతు వెంకన్న, ట్రాక్టర్ ఓనర్ బానోతు రమేశ్, బోడక నరేశ్‌లు పెద్దవంగర మండలంలోని పోచారం శివారు ఆకేరు వాగు నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా సమీప గ్రామాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) భూక్య లష్కర్, రెవెన్యూ సిబ్బంది అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేసి, పంచుల సమక్షంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్ఐ భూక్య లష్కర్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఇసుక దందా

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిశీధర్‌రెడ్డి

టేకుమట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక దందా చేస్తున్నారని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డి, ఇప్పుడు గండ్ర సత్యనారాయరణరావు ఇసుక దందాను పెంచి పోషిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం ఉంటే అక్రమంగా ఇసుకను తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యతను మరిచి కొత్త కొత్త పేర్లతో ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి టేకుమట్లలో జరిగే ఇసుక దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఒకరి పై ఒకరు ఆరోపణలు చేయడం మానేసి ఇసుక దందాకు ముగింపు పలికే ప్రయత్నాలు చేయడం మంచిదని హితవు పలికారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజ్, నాయకులు దేశెట్టి గోపాల్, బండారి సమ్మయ్య, సురేందర్‌రెడ్డి, అశోక్, రామ్మోహన్‌రావు, దొమ్మాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బెల్లం, పటిక పట్టివేత

ఒకరిపై కేసు.. బైక్ సీజ్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై నల్ల బెల్లం, పటిక తరలిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఆ బైక్‌ను సీజ్ చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మునిసిపల్ పరిధి బక్కరూపా తండాకు చెందిన కేలోత్ లాల్‌సింగ్ మంగళవారం రాత్రి వీరారం శివార్లో డంపు చేసిన నల్ల బెల్లం, పటికను బైక్‌పై తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుపడ్డాడు. బైక్‌ను సీజ్ చేసి, లాల్‌సింగ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూములకు పట్టాలివ్వండి

● స్థానిక ఎన్నికల వరకు పట్టాలివ్వకుంటే ఎలక్షన్లు బహిష్కరిస్తాం
● కలెక్టరేట్ ఎదుట నారాయణపురం రైతుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం కేసముద్రం మండలం నారాయణపురం రైతులు తమ భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేపట్టారు. 'తమ పట్టా భూములకు పట్టాలివ్వండి పొంగులేటి సారు.. అంటూ' ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నారాయణపురం రైతులకు ఏనిమిదేళ్లుగా పట్టేదారు పాస్‌పుస్తకాలు లేక రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, పంట రుణాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు తమ భూములకు పట్టాలివ్వకుంటే గ్రామంలో ఆ ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ ధారవత్ రవి, బీమా, వీరన్న, విరసింగ్, లచ్చు, లక్‌పతి, వెంకన్న, రవి, బాస్కర్, దేవా, బాలచందర్, శ్రీను పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరుచేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రవి

వెంకటాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ములుగు జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోడి అశోక్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మందులతో టీబీ వ్యాధిని అరికట్టొచ్చు

టీబీ నియంత్రణ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీబీ నియంత్రణ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మందులతో టీబీ వ్యాధిని అరికట్టొచ్చునని టీబీ నియంత్రణ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మరిపెడ పీహెచ్‌సీలో వైద్యులకు, వైద్య సిబ్బందికి టీబీ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 31వ తేది వరకు ఊరూరా టీబీ ముక్త్‌భారత్ పోగ్రామ్ నిర్వహించాలని ఆయన పల్లె డాక్టర్లకు, వైద్య సిబ్బందికి సూచించారు. వారాల తరబడి దగ్గు ఉండడం, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లక్షణాలు ఉన్నవారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు దాతలు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి, హెల్త్ సూపర్‌వైజర్లు మంగమ్మ, సుదర్శన్, ఆచార్యులు, క్షయ వ్యాధి సిబ్బంది నీలిమ, అశోక్, జయరాం, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దవంగర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గంట్లకుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ వివరాల ప్రకారం.. గంట్లకుంట గ్రామానికి చెందిన గుంటల అమృత (42) గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండగా తీవ్ర మనస్థాపంతో ఈ నెల 14వ తేదిన ఇంట్లో ఎవరులేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ముక్కావుల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు గుంటల అమృతకు కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్త కొంత కాలం కిందట మృతి చెందాడు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో

ఏసీబీ అధికారుల సోదాలు

● రికార్డులు పరిశీలన, పలురకాల సరుకుల శాంపిల్స్ సేకరణ



గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

మహబూబాబాద్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య పర్యవేక్షణలో ఫుడ్ ఇనిస్పెక్టర్లు, లీగల్‌మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం బుధవారం తనిఖీలు చేపట్టింది. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత అందజేసిన రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను వరంగల్ ఏసీబీ వారి ఆధ్వర్యంలో జిల్లా ఫుడ్ ఇనిస్పెక్టర్, లీగల్‌మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం సమన్వయంతో పాఠశాలను సందర్శించి, సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. మౌళిక వసతులు, పరిసరాల పరిశుభ్రత, బిల్డింగ్ వసతి, ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే అన్ని రకాల సరుకుల్లో నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. కారం, పసుపు, చింతపండుతో పాటు పలు రకాల సరుకుల శాంపిల్స్‌ను సేకరించామని, క్షేత్రస్థాయి నివేదిక, సరుకుల శాంపిల్స్‌ను ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ ఇనిస్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు, అధికారులు ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2456	1521
పల్లికాయ (సూక)	6110	3450
పల్లికాయ (పచ్చిది)	4550	1575
కందులు	5889	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7750	5300
పసుపు (కాడి)	11555	9534
పసుపు (గోల)	10259	9700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	12500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మళ్లీ 'ఇచ్చంపల్లి'..

- తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం
- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ



ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు

భూపాలపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న ఇచ్చంపల్లి బహుళార్థక ప్రాజెక్టు నిర్మాణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరి, ఇంద్రావతి నదులు కలిసే చోట రిజర్వాయర్ నిర్మించడం ద్వారా గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమంలో ఈ ప్రతిపాదనలు చేర్చాలంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జనవరుల మంత్రిత్వ శాఖకు లేఖ రాయడం చర్చనీయాంశమైంది. వాస్తవానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలోనే ఇచ్చంపల్లి, ప్రాణహిత, కంతనపల్లి ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఒప్పించే ప్రయత్నాలు కూడా అప్పట్లో జరిగాయి. మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా ఛత్తీస్‌గఢ్ వైపు అత్యధికంగా 9,500 ఎకరాలకు పైగా ముంపు ప్రాంతం ఉండటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులకు మోకాలడ్డింది. దీంతో ఆ ప్రతిపాదనలు మరుగున పడ్డాయి.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణించడం, రాష్ట్ర విభజన జరగడం లాంటి పరిణామాల క్రమంలో అధికారం చేపట్టిన టీఆర్ఎస్ మహాదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఈ పరిస్థితుల్లో ఇచ్చంపల్లి అంశం దాదాపు తెరమరుగైంది. అంతకుముందు ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నాటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు నేతృత్వంలో ప్రాజెక్టు సాధన సమితి ప్రతిపాదిత స్థలం వరకు పాదయాత్ర చేసి ఇచ్చంపల్లి వద్ద గోదావరి మాత విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. అంతే కాదు.. ఇచ్చంపల్లి ప్రాజెక్టును నిర్మించడం ద్వారా నాసిక్ నుంచి ధవళేశ్వరం దాకా జల రవాణాకు వీలుగా వాటర్ వే కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున కేంద్రం పరిశీలించాలని అప్పట్లో డిమాండ్ చేశారు. బీజేపీతోపాటు సీపీఎం నేతలు కూడా ప్రాజెక్టు సాధన కోసం ఇచ్చంపల్లి దాకా పాదయాత్ర చేశారు. గోదావరి వరదతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రవహించే ఇంద్రావతి ద్వారా జల లభ్యత అధికంగా ఉన్న దృష్ట్యా ఇక్కడ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా అటు విద్యుత్తు ఉత్పాదనతో పాటు నీటిని ఎత్తిపోసే దాదాపు 7లక్షల ఎకరాల భూములకు సాగునీటిని కూడా అందించే అవకాశం ఉంటుందని అంచనా వేశారు.

ఇచ్చంపల్లికి 159 ఏళ్ల చరిత్ర

ఇచ్చంపల్లి ప్రాజెక్టు చరిత్ర చాలా పురాతనమైనది. నిజాం కాలంలోనే అంటే.. 1866లో ఫ్రెంచ్ ఇంజనీర్ల సలహాతో ప్రాజెక్టు నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు జరిగాయి. నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే 1869లో ప్రబలిన ప్లేగు వ్యాధి కారణంగా నిర్మాణం అర్థంతరంగా ఆగిపోయింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేసిన ఫ్రెంచి ఇంజనీర్ కుటుంబ సభ్యులు ప్లేగు వ్యాధికి బలైపోవడంతో కార్మికులు ఇంజనీర్లు పనులను వదిలేసి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారని చెబుతుంటారు. ఆ ఫ్రెంచ్ ఇంజనీర్ కుటుంబ సభ్యుల సమాధులు, నిర్మాణ సామగ్రి, సున్నపు బట్టీల ఆనవాళ్లు ఇప్పటికీ ఇచ్చంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో చెక్కుచెదరకుండా ఉన్నాయి. అప్పట్లో గోదావరికి అడ్డుగా ఇంద్రావతి కలిసే చోట బట్టి సున్నం, రాళ్లతో కట్టిన నిర్మాణాలు 159 ఏళ్లయినా చెక్కుచెదరకుండా కనిపించడం విశేషం.

మేడిగడ్డ ఉనికి ప్రశ్నార్థకం..

బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

2023లో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు దెబ్బతినడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నీటిని నిల్వ చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనల ప్రకారం మేడిగడ్డకు ప్రత్యామ్నాయంగా ఇచ్చంపల్లి ప్రాజెక్టు చేపడితే బ్యాక్ వాటర్ ద్వారా నీటిని వాడుకునే వెసులుబాటు ఉంటుందని, అలాంటప్పుడు ఇక మేడిగడ్డతో పనేముంటుందని నిపుణులు అంటున్నారు.

బనకచర్ల వివాదం నేపథ్యంలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలను బనకచర్లకు అనుసంధానం చేయడం ద్వారా రాయలసీమలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సాగునీటిని అందించే ఉద్దేశంతో బనకచర్లకు అనుమతులను కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన నేపథ్యంలో గోదావరి జలాల తరలింపుపై తెలంగాణ అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో వివాదం రాజుకుంది. ఈ నేపథ్యంలో నిన్న మొన్నటి వరకు ఇచ్చంపల్లి నుంచి దక్షిణాది రాష్ట్రాలకు గోదావరి జలాలను తరలించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన రాష్ట్రం తాజా పరిణామాల్లో గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియకు సూత్రప్రాయ అంగీకారం తెలపడం చర్చనీయాంశంగా మారింది. తద్వారా ఇచ్చంపల్లి వద్ద 100 మీటర్ల ఎత్తుతో డ్యామ్‌ను నిర్మించడం ద్వారా అటు 975 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు దాదాపు 200 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషిసంచాయి యోజన పథకంలో చేర్చి నిధులు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.



ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో ఫ్రెంచ్ అధికారులు నిర్మించిన కట్టడం



డీఐజీకి గౌరవ వందనం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది



బెటాలియన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ సి.సన్నీ

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి..

టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ

మామునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన మామునూరు బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో డీఐజీకి ఘనస్వాగతం పలికారు. బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్‌లోని మోటర్ ట్రాన్స్‌పోర్టు, హెడ్‌క్వాటర్ యూనిట్ హాస్పిటల్, క్యాంప్ ఆఫీసులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతగల ఉద్యోగులుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస రావు, వీరన్న, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. బుధవారం రాయపర్తి పీహెచ్‌సీ పరిధిలోని నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ప్రతీ రోజు గృహ సందర్శన చేయాలని ఆదేశించారు. కంఠాత్మాకూరు గ్రామంలో ఎక్కువగా ఫీవర్ కేసులు వస్తున్నాయని వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలన్నారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో వచ్చే మూడు రోజులు నిర్వహించే టీబీ పరీక్షలను క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.అవసరం ఉన్న వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే పరీక్షలు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కొక్కొండ దివ్య, పల్లె దవాఖానా డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కస్తూరీనగరంలో నీళ్ల బిందెతో వరి నారు తడుపుతున్న రైతు రాంబాబు

హలధారి.. అరిగోస

నారుమడులు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం..

బయ్యారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరుణుడు ముఖం చాటేశాడు. రైతన్న అరిగోస పడుతున్నాడు. పంటను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. వానాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా.. సరిపడా వానలు పడిన దాఖలాలు లేవు. ఖరీఫ్ పంట సాగుకు ఆదిలోనే వరుణుడు శాపంగా మారాడు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా రైతన్నలు పక్షం రోజుల క్రితం సాగు పనులు ప్రారంభించారు. అందులో భాగంగా పలువురు రైతులు వరి నారుమడి సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. అనంతరం అరకొర చిరు జల్లులు మినహా పెద్దగా వర్షాలు కురవకపోవడంతో చాలా మంది రైతుల వరి నారు ఎండిపోయే దశకు చేరుకుటుంది. ఈ క్రమంలోనే బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన మాలోత్ రాంబాబు, దరావత్ బాబులాల్ అనే రైతులు వరి నారును బతికించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చుతున్నారు.ట్యాంకర్ల సహాయంతో నీటిని తీసుకొచ్చి బిందెలు, క్యాన్లతో వరి నారుమడులను తడుపుతున్నారు.

ఖరారైన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

- జడ్పీటీసీలు 75, ఎంపీటీసీలు 778
- జారీ అయిన అధికారిక ఉత్తర్వులు

హనుమకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం జడ్పీటీసీ స్థానాలు 75 కాగా, ఎంపీటీసీ స్థానాలు 778. నాలుగు కొత్త మండలాలు కేజే మల్లంపల్లి, ఇనుగుర్తి, సీరోలు, గోరికొత్తపల్లి ఏర్పాటు కావడంతో జడ్పీటీసీల సంఖ్య 71 నుంచి 75కు పెరిగింది. 3 కొత్త మున్సిపాలిటీలు- కేసముద్రం, ములుగు, స్టేషన్‌ఘనపూర్ ఏర్పాటు కావడంతో కొన్ని గ్రామాలు వాటిలో విలీనం అయినందు వల్ల ఎంపీటీసీ స్థానాలు 792 నుంచి 778కు తగ్గాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది.

జిల్లాలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
వరంగల్	11	130
హనుమకొండ	12	129
జయశంకర్ భూపాలపల్లి	12	109
మహబూబాబాద్	18	193
జనగామ	12	134
ములుగు	10	83
మొత్తం	75	778

ఉద్యమాల యోధుడు

ప్రభంజన్ కన్నుమూత

- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత



పాలకుర్తిలో ప్రభంజన్ మృతదేహం వద్ద గద్దర్ కూతురు వెన్నెల, జర్నలిస్టు కదిరే కృష్ణ



ప్రభంజన్ అంతిమయాత్ర

పాలకుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులాల ఉద్యమ నాయకుడు, విద్యావేత్త, రచయిత, జర్నలిస్టు యాదనాల ప్రభంజన్ కుమార్ యాదవ్ (62) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభంజన్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం మరణించారు. ఆయనకు భార్య రేఖ, ఇద్దరు కుమారులు వున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామానికి తీసుకురాగా, భిన్న రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం, పార్థివదేహాన్ని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

విద్యార్థి దశ నుంచే ఉద్యమ స్వభావం కలిగిన ప్రభంజన్ కుమార్ బలహీనవర్గాల కులాలు, బహుజన హక్కుల కోసం ఉద్యమ బాటపట్టారు. సామాజిక న్యాయం కోసం జర్నలిజాన్ని ఆయుధంగా ఉపయోగించారు. పలు పత్రికలతో పాటు విద్యారంగానికీ సేవలందించారు. కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీల్లో జర్నలిజం విభాగాలను స్థాపించడంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రభంజన్ స్వస్థలం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామం. యాదనాల కొంరమ్మ, సోమయ్య దంపతులకు 1963 మార్చి 21న ప్రథమ సంతానంగా జన్మించాడు. ప్రభంజన్‌కు ముగ్గురు సోదరులు, ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. తండ్రి సోమయ్య పదేండ్ల క్రితం మృతి చెందారు.

ప్రభంజన్ ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అమ్మమ్మ ఊరిలోని జఫర్‌గఢ్ మండలం కూనురులో చదివారు. ఇంటర్ నిజామాబాద్, డిగ్రీ, పీజీ ఉస్మానియా వర్సిటీలో పూర్తి చేశారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉన్నత విద్య తర్వాత యూపీఎస్సీ ద్వారా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సాధించారు. 1998లో ఐఐఎస్ అధికారిగా ఆలిండియా రేడియోలో డిప్యూటీ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో పీఆర్‌వోగా కొద్దిరోజులు పని చేసి ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. డోలు దెబ్బ, యాదవ ఇంటలెక్చువల్ ఫోరం స్థాపనలో పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య రూపురేఖలను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ప్రభంజన్ కుమారే. గద్దర్ నడిపించిన జననాట్య మండలిపై ఎంఫిల్ థీసిస్ ప్రజంటేషన్ చేశారు. తెలంగాణ వర్సిటీలో జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేసి 2017లో వీఆర్ఎస్ తీసుకున్నారు. ప్రభంజన్ కుమార్ అంతర్యం, ప్రభంజన పథం, గొల్ల కుర్మల సంస్కృతి గొప్ప సంస్కృతి, డోలుదెబ్బ, దండోరా, నడుస్తున్న చరిత్ర, కాసుల జ్ఞానం, బహుజన మీడియా లాంటి పుస్తకాలు రాశారు. కొన్ని నెలల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. ప్రముఖ రచయిత, కవి గూడ అంజయ్య సోదరుని కూతురు డాక్టర్ రేఖను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు జనగామ వైద్య కళాశాలకు అప్పగించారు. అంతకుముందు గూడూరు గ్రామంలో బుధవారం అంతిమయాత్ర నిర్వహించారు.

పలువురు ప్రముఖుల నివాళి

ప్రభంజన్ మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు తీరని లోటన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభంజన్ భౌతికకాయానికి తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ జి.వి. వెన్నెల పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, చెరుకు సుధాకర్, జర్నలిస్టు కదిరే కృష్ణ, బత్తుల సిద్ధేశ్వర్, కవి, రచయిత శంకరమంచి శ్యాంప్రసాద్, రచయిత రాపోలు సత్యనారాయణ, జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు ప్రభంజన్ భౌతికకాయానికి నివాళులర్పించారు.



డీఈవో వాసంతికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

'భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజనకార్మికుల యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఐదు నెలల నుంచి బకాయి వేతనాలు ఇవ్వకుంటే ఏ విధంగా పని చేయాలో చెప్పాలన్నారు. ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, కోడి గుడ్ల బకాయిలు సైతం తక్షణమే అందించాలన్నారు.కార్మికులకు కనీస వేతనంగా రూ. 26 వేలు అందించి ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈఓ వాసంతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి కె.శాంత, ఎండి.పర్వీన్, జి.లక్ష్మీ, సునీత, మమత, రేవతి, జిజియా తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో నిరసన చేస్తున్న విద్యార్థులు

ఎడ్యుకేషన్ కళాశాలలో విద్యార్థుల నిరసన

సమస్యలు పరిష్కరించాలి డిమాండ్

కేయూ క్యాంపస్ జూలై 16, (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ ఎడ్యుకేషన్ కళాశాలలోని విద్యార్థులు కళాశాలలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు నిరసన చేపట్టారు. కళాశాల వద్ద బైఠాయించారు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గత కొన్ని రోజులుగా కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలకు రెగ్యులర్ అధికారులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్దకు వర్సిటీ ఉన్నతాధికారులు వచ్చి సరైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఈడీ, ఎంఈడీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



జమాండ్లపల్లి అర్బన్ పార్కులో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

మహబూబాబాద్, జూలై16 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి మానుకోటను మ్రానుకోటగా మార్చుదామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి జమాండ్లపల్లిలోని అర్బన్ పార్కులో తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం వాచ్‌టవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి వనమహోత్సవానికి శ్రీకారం చుట్టారని, జిల్లాలో అన్నిశాఖల ఆధ్వర్యంలో 50 లక్షల మొక్కలు నాటే విధంగా లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అటవీశాఖ అధికారి బి.విశాల్, అధికారులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రావు, జ్యోత్స్నాదేవి, పి.సురేష్, వి.చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్, బోడ రవినాయక్, అజ్మీర సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదిన కేక్‌లను కట్‌చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, మిట్టకంటి రాంరెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, పోతురాజు రాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్, సల్పాది దిలీప్, అజ్మీర సురేష్‌నాయక్, భూక్య హరిసింగ్, నెక్కొండ మార్కెట్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎమ్డీ. అయూబ్‌ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

'కార్యకర్తలను విస్మరించడం సరికాదు'

● నియోజకవర్గంలో ఝాన్సీరెడ్డి పెత్తనం ఏమిటి?



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో 30 సంవత్సరాలుగా ఉంటూ పార్టీలో అభివృద్ధికి పాటుపడుతున్న కార్యకర్తలను ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గానికి వచ్చిన ఝాన్సీరెడ్డి కార్యకర్తలను విస్మరిస్తూ ఎవరిని కలుపుకుపోకుండా సొంత పెత్తనాలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మెరుగు మల్లేశం, నాయకులు చిట్టిమల్ల మహేష్, బాలు నాయక్‌లు ప్రశ్నించారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీ అధికారం లేనపుడు పార్టీని కాపాడుకున్నామన్నారు. అధికారం వచ్చిన తర్వాత దోచుకునేందుకు వచ్చిన అరడజన్ దొంగలను పక్కన పెట్టుకుని అసలైన కార్యకర్తలను విస్మరించడం సరికాదన్నారు. మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డిపై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు మాట్లాడే అర్హత లేదని, తిరుపతిరెడ్డి నియోజకవర్గానికి చెందిన నాయకుడని, గత 50 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నిరంజన్‌రెడ్డిని విమర్శించేస్థాయి ఇటీవల వచ్చిన నాయకులకు లేదన్నారు. కాంగ్రెస్ పేరుతో ఎమ్మెల్యేను అడ్డు పెట్టుకుని తామే అసలైన కాంగ్రెస్ నాయకులమని మాట్లాడితే ప్రజలు ఊరుకోరని, విమర్శలు మానుకోవాలన్నారు. ఎమ్మెల్యే యశస్వినిని పక్కన పెట్టి ఝాన్సీరెడ్డి నియోజకవర్గంలో ఇన్‌చార్జిల పేరుతో గ్రూప్‌లు ఏర్పాటుచేసి పార్టీ కార్యకర్తలను విభజించి పాలిస్తుందని, ఇదే జరిగితే స్థానిక ఎన్నికల్లో ప్రజలు గుర్తించరన్నారు. వెంటనే కార్యకర్తలను విస్మరించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, ఎల్లయ్య, యాకమల్లు, హరీశ్, సంపత్ తదితరులు ఉన్నారు.

హన్మంతుకు ప్రముఖుల నివాళులు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతుకు బుధవారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గుంజె హన్మంతు చిత్రపటం వద్ద స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో హన్మంతు క్రియాశీల పాత్ర పోషించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ పాషా, ఎడ్ల రమేష్, శంతన్ రామరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

● తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు చిత్రపటానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, జేఏసీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మూల రంగారెడ్డి, ముత్యం వెంకన్న, మార్నేని శ్రీదేవి, తెలంగాణ ఉద్యమ జేఏసీ పూర్వ కన్వీనర్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, రాంచంద్రు పాల్గొన్నారు.



హన్మంతు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మాలోతు కవిత, తెలంగాణ ఉద్యమ జేఏసీ నేతలు

23న వాహనాలకు వేలం

నెహ్రూసెంటర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సారా, బెల్లం సరఫరా కేసులో పట్టుబడిన వాహనాలకు ఈనెల 23న మహబూబాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు వాహన ధరలో 50 శాతం డిపాజిట్ చేయాలని, ఎక్సైజ్ కార్యాలయం మహబూబాబాద్ పేరున డీడీ తీయాలన్నారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌తో పాటు కురవి, గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాయని, వాటిని చూసుకోవాలని చెప్పారు. 17 నుంచి 22న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు చెప్పారు.

అక్రమ వసూళ్లను నిలిపివేయాలి

తొర్రూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మంగళవారం తొర్రూరులో నిర్వహించే వారాంతపు సంతలో లోకల్ ఆటో డ్రైవర్ల వద్ద చేస్తున్న అక్రమ వసూళ్లను నిలిపివేయాలని కోరుతూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడారు. అంగడి టెండర్ నిర్వాహకులు గంపచీటీ, ఇతర వ్యాపారాలు చేసుకునే వారివద్ద మునిసిపల్ నిబంధనల మేరకు వసూలు చేయాలన్నారు. అంగడికి ప్రయాణీకులను తీసుకువచ్చే ఆటోడ్రైవర్ల వద్ద అక్రమంగా రూ.50 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ నిబంధనలు పాటించకుండా ఆటోల వద్ద అక్రమంగా వసూలు చేయడం సరికాదన్నారు. మునిసిపాలిటీ అంగడి టెండర్‌కు లోకల్ ఆటోలకు సంబంధం లేదన్నారు. అంగడి టెండర్ దారులు అక్రమ దందాలకు తెరలేపి వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆటో యూనియన్ నాయకులు రంజిత్, నరేష్, దినేష్, సదానందం, యాకన్న, సోమన్న, మధు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ చెర్లపాలెం అధ్యక్షుడి రాజీనామా

తొర్రూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ చెర్లపాలెం గ్రామ అధ్యక్షుడు ఎక్కటి నాగిరెడ్డి పదవికి రాజీనామా చేసినట్లు బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గత 8ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ చెర్లపాలెం గ్రామ అధ్యక్షుడిగా పనిచేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం పని చేశానని చెప్పారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆందోళనకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తిరుపతి రెడ్డితో సాగిన ప్రయాణం తన వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదని, గ్రామంలోని అభివృద్ధి పనుల్లో భాగంగా పార్టీ నాయకుడిగా ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. ఏది ఏమైనా తన ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యకర్తలు గొడవ చేసి, టెంట్ కూల్చారని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా పత్రాన్ని పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి పంపించినట్లు తెలిపారు. నిఖార్సయిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు.

వాటర్‌ప్లాంట్ అందించడం అభినందనీయం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మినీ మినరల్ వాటర్ ప్లాంట్ బహూకరించడం అభినందనీయమని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్ట్రీట్ కాజ్ సంస్థ గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల ఆర్థిక సహకారంతో రూ. 2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినీ మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు బడుగు, బలహీన వర్గాల పిల్లలే ఉంటారని వారికి స్వచ్ఛమైనతాగునీటిని అందించడం సంతోషకరమన్నారు. రానున్నది వర్షాకాలం అయినందు వలన విద్యార్థులకు తాగునీటి సమస్యలేకుండా ఏర్పాటు చేసిన స్ట్రీట్ కాజ్ సంస్థ గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంను అభినందించారు. స్ట్రీట్ కాజ్ సంస్థ గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల చీఫ్ అడ్వైజర్ కటికనేని నిహాల్‌క్రిష్ణ, , అల్యూమిని మెంటర్ రోహిత్, అధ్యక్షుడు ఆదిత్య రెడ్డి, గేయశ్రీ, బావేష్, సుమంత్. శ్వేయ, మృదుల, వినత, సృజన్, మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

బయ్యారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను బయ్యారం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణం జిల్లాకు చెందిన ఇరువురు వ్యక్తులు సుమారు 6 కేజీల ఎండు గంజాయిని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు తరలిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బయ్యారం పోలీసులు అక్రమంగా గంజాయిని రవాణా చేసే ముఠాను కాపుకాసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, ఎక్కడి నుంచి గంజాయి తీసుకొస్తున్నారు? ఎంత కాలం నుండి గంజాయి సరఫర చేస్తున్నారు.! ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఈ విషయమై బయ్యారం ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. తమ ఆధీనంలో గంజాయి నిందితులు లేరని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరు మృతి

డోర్నకల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలు నుంచిజారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం గుండ్రాతిమడుగు-మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ల నడుమ చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గుండ్రాతిమడుగు-మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ల మధ్య కిలోమీటర్ 449/17-19 మధ్య ఎగువలైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండడంతో కొందరు వ్యక్తులు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. మృతుడు బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ టీషర్టు, గ్రీన్‌కలర్ లోయర్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సెల్ - 8712658602 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.



రిలే దీక్షల్లో కూర్చున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఏజెన్సీ ఉద్యోగాలకు చట్టం చేయాలి

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ఉద్యోగాలకు చట్టం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాగాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో బుధవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వ నుంచి ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్ ప్రకారం.. విద్యా, ఉద్యోగం, ఉపాధి, భూమి, నీరు, అడవిపై హక్కులు కల్పించబడినట్లు పేర్కొన్నారు. 1/70, ఎల్‌టీఆర్, పీసా, ఆర్వోఎఫ్‌ఆర్ చట్టాలకు చట్టసభల్లో ప్రత్యేక గిరిజన మంత్రిత్వశాఖ, జాతీయ ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయబడ్డాయని చెప్పారు. ఉద్యోగ నియామకాలలో ఆదివాసీల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 3 ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. నాయకులు కొట్టెం ముఖర్జీ, బొల్లి సారయ్య, సిద్ధబోయిన భాస్కర్, లింగాల కిరణ్, పడిగే నాగేశ్వర్‌రావు, వజ్జయ్య, మల్లేష్, సునీల్, నాగేష్, దేవేందర్, నరేష్, శ్రీను, మంగయ్య పాల్గొన్నారు.

బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్లో డే

మహబూబాబాద్ టౌన్, జూలై16 (ఆంధ్రజ్యోతి):మహబూబాబాద్ పట్టణ శివారు బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఎల్లో డేను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్, ఆయా, పిల్లలు, వారి తల్లులు అంతా ఎల్లోకలర్ దుస్తులు ధరించి కార్యక్రమంలో హాజరయ్యారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గుండు సులోచన మాట్లాడుతూ..అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లలకు రంగులపై అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్లో డేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా, పిల్లలు తల్లులు శైలజ, స్వరూప, వినోద, లత పాల్గొన్నారు.

● ఏకశిల ఏంజిల్స్ పాఠశాలలో ఎరుపు రంగు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎరుపు రంగు అనేది శక్తి, వేడి, ప్రేమ, కోపం, ధైర్యం వంటి భావాలను వ్యక్తం చేస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. మయూరీ, రమేష్‌రెడ్డి, ఐస్లీన్ పాల్గొన్నారు.



ఎల్లో డేలో పాల్గొన్న టీచర్ గుండు సులోచన, ఆయాలు, పిల్లలు

మూగ జీవాలకు మందులు అందించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మూగ జీవాలకు సీజనల్‌గా వచ్చే అన్నిరకాల వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం ఉచితంగా నట్టల మందు, వ్యాక్సిన్‌లను అందించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పశువైద్యాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జీఎంపీఎస్ టౌన్ అధ్యక్షుడు గంధ్రకోటి కుమార్, చలగోల మల్లయ్య, కుండె అశోక్, నేతుల రాకేష్, శ్రీను, దామోదర్, రఘు, రాజు, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి రేవంత్‌రెడ్డి పెద్దపీట

● డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్

కురవి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. కురవి మండల కేంద్రంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నారని, తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు మద్దతు ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం జరుగుతుందన్నారు. అంబటి వీరభద్రం, బండి శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, తహసీల్దార్ విజయ పాల్గొన్నారు.

ఊరంతా ఒక్కటే కుటుంబంగా వనభోజనాలకు

● ఇంటింటికి కోళ్లను పంపిణీ చేసిన గ్రామపెద్దలు

కొత్తగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆ ఊరంతా ఒక్కటే కుటుంబంగా.. వన భోజనాలకు తరలివెళ్లడం ఆ ఊరి ప్రత్యేకత. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని బూరుగుగుంపు గ్రామంలో బుధవారం ఆషాడం వంటలకు అడవికి తరలివెళ్లారు. గ్రామంలో ఒక ప్రత్యేకత ఉంది.. గతకొన్ని సంవత్సరాలుగా గ్రామస్థులు వనభోజనాలకు వెళితే గ్రామపెద్దలే ఇంటింటికి ఒక కోడి, సామగ్రి అందజేస్తారు. బుధవారం వనభోజనాలకు వెళుతున్న గ్రామస్థులకు గ్రామపెద్దలు కోళ్లను పంపిణీ చేశారు. అందుకు కావాల్సిన డబ్బులను సంవత్సరం కాలంలో వివిధ రూపాలలో సేకరించి గ్రామపెద్దల వద్ద నిల్వ చేస్తారు. వనభోజనాల సమయంలో ఇలా ఉపయోగిస్తారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కేసముద్రం, జూలై16 (ఆంధ్రజ్యోతి) : కల్వల శివారు గాంధీనగర్ సమీపంలో బుధవారం సాయంత్రం భూక్య దేవకు చెందిన గేదె తెగిపడిన విద్యుత్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.



గాంధీనగర్‌లో మృతి చెందిన గేదె

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

● టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావ్ పూలే రెసిడెన్సియల్ పాఠశాలలో 'సైబర్ సేఫ్టీ.. సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి పట్టుదలతో చదవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతూ వివిధ రకాలుగా ప్రజలను మోసం చేస్తునే ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఎస్సై బి.కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై అరుణ్‌కుమార్, శివ, సిబ్బంది ఉన్నారు.

'రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయం'

డోర్నకల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. పెరుమాండ్ల సంకీసకు చెందిన కొందరు బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. వారికి కాషాయం కండువా కప్పిసాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా కుంటుపడిందని, బీఆర్‌ఎస్ పార్టీ సెంటిమెంట్ రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ పార్టీని కోరుకుంటున్నారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చీకటి మహేష్‌గౌడ్, కౌన్సిల్ సభ్యుల లక్ష్మీనారాయణ వ్యాస్, రాయల రాంబాబు, రూరల్ అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణాధ్యక్షుడు దేవాసింగ్ నాయక్, నాయకులు అశోక్‌కుమార్, ఉపేందర్, రామా రావు, సుదర్శన్‌లు పాల్గొన్నారు.

సీఆర్పీ కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవంగర, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దవంగర ఎంఆర్‌సీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వేముల సంతోష్ భార్య ఝాన్సీ ఇటీవల మరణించారు. బుధవారం మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈవో బుదారపు శ్రీనివాస్ మనోధైర్యాన్ని కల్పిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపి, వారి కుటుంబానికి రూ.లక్ష 75 వేల ఆర్థికసాయం అందించారు. ఆర్థికసాయాన్ని సంతోష్ కుమార్తె అబుదా పేరుతో డిపాజిట్ చేశారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, శేశావలి, సోమారపు ఐలయ్య, సురేష్, వెంకన్న, సతీష్, నర్సింహారెడ్డి ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు కేలోతు సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో సంఘం నాయకుడు గుగులోతు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం భారీ చేపట్టి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం పేరుతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. అనంతరం సదరు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతికుమార్, శ్రీకాంత్, దేవేందర్, శివవర్మ, జవహర్‌లాల్, రమేష్, ప్రవీణ్, లక్ష్మణ్, దిలీప్, పావని, మౌనిక, స్వప్న, తరుణ్ పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు 'ఇన్‌స్పైర్'

(5వ పేజీ తరువాయి)

ఆచరణలో పెట్టి పరిశోధకులుగా ఎదగడానికి ఇదో ప్రత్యేక వేదికగా మారుతోంది.

దేశవ్యాప్తంగా అవార్డులు..

దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది బడుల నుంచి 10 లక్షల ఆలోచనలను సేకరించి అందులో ఉత్తమమైన లక్ష పరిష్కారాలను ఎంపిక చేస్తారు. వీటిని సూచించిన లక్ష మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనడానికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అవార్డులను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో విద్యార్థులు తమ ఆలోచనలకు నమూనాలను తయారు చేసి సదరు ఎగ్జిబిషన్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల నుంచి 10 వేల ఉత్తమ ఆలోచనలను గుర్తిస్తారు. వాటిని అందించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సాయాన్ని అందించేందుకు ప్రతీ విద్యార్థికి ఒక మెంటార్‌ను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా (ఎన్‌ఐఎఫ్) ఇతర ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఆపై జాతీయ స్థాయిలో అంతిమంగా ఎంపికైన 60 ప్రాజెక్టులు రాష్ట్రపతి భవన్‌లో జరిగే వార్షికోత్సవ ఉత్సవాల్లో ప్రదర్శించబడుతాయి. ఇందులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ. 25 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గార్ల వాసి



వెంకన్నజాదవ్

గార్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా గార్ల మండల సీతంపేటకు చెందిన బాదావత్ వెంకన్నజాదవ్ (ఐఆర్‌టీఎస్)ను సంస్థ నియమించింది ఈ మేరకు ఆయన బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. మండలంలోని గిరిజన గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన వెంకన్నజాదవ్ ఉన్నత చదువులు చదివి అంచెలంచెలుగా ఎదిగి సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పదవిలోకి రావడంతో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, సేవాలాల్ సేనా జిల్లా నాయకుడు జాటోత్ విజయ్ కుమార్ అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

మధు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ

మరిపెడ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉల్లేపల్లికి చెందిన నవిల హన్స్‌న్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకుడు బొడ్డు వెంకన్న బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుని భార్య, కుమారుడు మధుకు రూ.2500, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. మధు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట బొడ్డు పెద్ద వెంకన్న, మద్దోజు వెంకన్న, ధనమ్మ, సావిత్రి, శ్రీను, బంటు నర్సయ్య, చిన్న వీరన్న, లింగయ్య, రాసమల్ల కృష్ణ, బొడ్డు సురేష్, పాల్వాయి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

కొత్తగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాల ప్రకారం. గూడూరు మండలం నుంచి కొత్తగూడ మండలం కార్లాయికి అక్రమంగా ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు దాడులు చేసి ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌లను కొత్తగూడలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

(5వ పేజీ తరువాయి)

రైతుభరోసా అంటూ భ్రమలు కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతే రాజు నినాదం కాదు.. గత కేసీఆర్ ప్రభుత్వ విధానమన్నారు. రాష్ట్రాన్ని కరువు కాటేయ్యడం కాదు.. కాల్వల్లో నీరు పారించకుండా కాంగ్రెస్ కాటు వేస్తుందని చెప్పారు. కాళేశ్వరం నీటిని ఎత్తిపోయకుండా కక్షకట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాల్వల్లో నీళ్లకు బదులుగా రైతుల కన్నీళ్లు పారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీకోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖాసీం, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నాయకులు నూకల సురేందర్, బానోత్ నర్సింహానాయక్, కోడి రవి, వేణుగోపాల్‌రెడ్డి, సంపత్‌రావు, బానోత్ మోతీలాల్, కటార్‌సింగ్, బోడ కిషన్, యాకయ్య, ఎల్లయ్య, మన్మోహన్‌రెడ్డి, చీదురు వెంకన్న, రహీం, కుమార్ పాల్గొన్నారు.